


'పాపా! కప్పు తీసికొని రా. చంద్రకి కాఫీ తీసికొని వెళ్ళువుగాని' కాఫీ ఫ్లాస్కులో పోస్తూ అంది అమ్మ. ఫ్రిజిడేర్ తెరవబోతున్న నేను అమ్మ మాటలు విని మాట్లాడకుండ ఫ్రిజి తెరచి గ్రుడ్డు తీసి త్రాగి పెంకు తీసికొని వెళ్ళి డబ్బాలో వడేశాను.

'ఏం చేస్తున్నావ్? కప్పు తీసుకు రమ్మంటుంటే?' పెర్క్యులేటర్ వంటి మనిషికి కడగడానికి యిస్తూ విసుగ్గా అంది. ఇక మాట్లాడకపోతే లాభం లేదని 'దయచేసి చంద్రకి కాఫీ ఎవరితో నన్నా పంపమ్మా! నా కిష్టం లేదతనికి తీసికొని వెళ్ళడానికి.' అన్నాను.

ఆశ్చర్యంతో అమ్మ కనుబొమలు వెడల్పుగా మారినాయి. 'ఏం జరిగింది?' అన్నట్లున్నాయి ఆశ్చర్యంతో కూడిన అమ్మ చూపులు.

'ఛ! అసలు బుద్ధిలేదతనికి. పెద్ద చదువు చదువుతున్నాడు గాని ఇంగిత జ్ఞానం లేని మనిషి ఒక మనిషేనా? సరదాగా తనతో నాలుగు మాటలు మాట్లాడినంత మాత్రానా లేనిపోని అర్థాలు తీస్తున్నాడు. నిన్న ఏం జరిగిందంటే'...

ఒక్క క్షణం ఆగి అమ్మని చూశాను. రైస్ కుక్కర్ గిన్నెలో బియ్యం పోసి, కప్పుతో నీళ్ళు కొలిచిపోస్తూ నా మాటలు వింటూంది అమ్మ. పెర్క్యులేటర్ కడుగుతూ మాటలు విననట్లు నటిస్తూంది వంట మనిషి.

'నిన్న ఏం జరిగిందంటే తోటలో మొక్కలికి నీళ్ళు పోస్తూంటే, చంద్ర వచ్చి నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి పాపా! అన్నాడు. ఏమిటన్నాను. 'అసలు నాగురించి నీకెలాంటి అభిప్రాయముందో సూటిగా చెప్పు' అన్నాడు. ఆశ్చర్యం, కోపం రెండూ చుట్టుముట్టాయి నన్ను. అనవసరంగా యిలాంటి విషయాలు మాట్లాడకు చంద్రా! అయినా నీమీద అభిప్రాయాలు ఏర్పరచుకోవాల్సిన అవసరం నాకేముంది? అని గట్టిగా సమాధానం చెప్పానమ్మా! 'అదికాదు పాపా! ఏన్నాళ్ళనుండో నాలో రేగుతున్న భావనలకి నామీద నీకున్న అభిప్రాయం ద్వారా రూపం కల్పించాలనే ఆశతో వెయ్యి మైళ్ళ దూరం ప్రయాణం చేసి వచ్చాను. చెప్పు పాపా! అన్నాడు.

'షటప్! ఇలాంటి ప్రసంగం యింకెప్పుడూ నా దగ్గర తేకు' అని అన్నాను. చూడమ్మా! ఎలాంటివాడో! నేను ఎలాంటి సంకోచాలు పెట్టుకోకుండ మాట్లాడబట్టేగా యిలాంటి అర్థాలు తీస్తున్నాడు. నాలో సగం వున్నాడు పొడుగులో గాని, వెడల్పులో గాని. ఛ! యిలాంటి వాళ్లతో మాట్లాడడం నాదే తప్పమ్మా!' జీర పోయింది నా గొంతు.

'కొంచెం అదుపులో వుండడం మంచిది పాప నువ్వు. అతనెప్పుడూ అలా మాట్లాడడు. నువ్వు అతనలా మాట్లాడడానికి తగినంత చనువివ్వబట్టే అలా అడిగాడు' యిందులో అంతా నాదే తప్పన్నట్లు రైస్ కుక్కర్ స్విచ్ వేస్తూ అంది అమ్మ.

నిర్ఘాంతపోయాను నేను.

'అంటే నాదే తప్పంటావా?' దుఃఖం నా గొంతులో సుళుగ తిరుగుతూంది.

అమ్మ మాట్లాడకుండ మజ్జిగ చిలకడానికి మిక్సర్ ఆన్ చేసింది.

'అమ్మగా అర్థం చేసికొని మాట్లాడతావనుకొన్నాను గాని... ఛ! నాదే బుద్ధి తక్కువ నీతో చెప్పడం' అనేసి గబగబా బయటకు వచ్చేశాను.

'ఏంటి ప్రొద్దునే ఏడుపు మొహంతో ఎదురువచ్చావ్?' అన్నాడు కాఫీకోసం వంటింట్లోకి రాబోతున్న రాజన్నయ్య.

'మాటలు కొంచెం ఆలోచించి మాట్లాడు రాజా!' అని, కోపంగా అని డైనింగ్ రూంలో కొచ్చి ఆగాను అమ్మ ఏమంటుందోనని.

నేనాశించినట్లే అమ్మ 'ఎప్పుడూ వుండే ఏడుపేగా. ఇందులో క్రొత్తేం వుంది' అన్న మాటలు వినబడ్డాయి. నిర్లక్ష్యంగా నవ్వుకొని మేడమీద నా గదిలోకి వెళ్లిపోయాను.

చదువుకోవడానికి పుస్తకం తెరచి ముందుంచుకొన్నాను గాని మనస్సు దాని మీద లగ్నం కావటంలేదు. ఎందుకో చిరాగ్గా, చేతిలోవున్న పుస్తకాన్ని చిన్న చిన్న ముక్కలుగా చించి పారేయాలన్నంత విసుగ్గా వుంది. అమ్మ తరహా నాకెప్పుడూ విచిత్రంగా, విడ్డూరంగా కనబడ్తూంది. ప్రేమగా అమ్మ సమీపానికి వెళ్తే, తిరిగి వచ్చేటప్పుడు మనస్సు బరువుగా మారిపోతూంది. అమ్మ తనకు తెలియకుండానే పరోక్షంగా నన్ను ద్వేషిస్తుందని అమ్మకు —అనుభవిస్తున్న నాకు తెలుసు. కాని విచిత్రమేమిటంటే— నేనెప్పుడూ నన్నెందుకిలా ద్వేషిస్తావని ప్రశ్నించలేదు. కాని— కాని—ఈరోజు నన్ను నేను నిగ్రహించుకోలేక నీతో చెప్పడం నాదే పొరబాటని అనేస్తే, విన్న అమ్మ విస్తుబోయి చూడడం నేను స్పష్టంగా గమనించాను.

నన్నెందుకు అమ్మ ద్వేషిస్తుందో నాకు కారణం తెలుసు. కాని ఆ కారణాన్ని మాపే శక్తి నాకు — మరెవ్వరికీ లేదు. అందుకు నేనేం చేయగలను? అంతలా ద్వేషిస్తే మాత్రం ఉచితానుచితాలు తెలియవా? నోటికి ఎలాతోస్తే అలాగేనా? ఇలా అమ్మని నాలో నేనే విమర్శించుకొంటుంటే పూర్వం జరిగిన సంఘటనలు జ్ఞాపకానికి వస్తున్నాయి.

నేను పి. యు. సి. చదువుకొనే రోజుల్లో దసరా సెలవులవి. నేను అక్కయ్యా యిద్దరూ ఫ్రెండ్ యింటికి వెళ్ళి తిరిగి వస్తూంటే మధ్యలో వర్షం పట్టుకొంది. వర్షం అంటే నాకు చాలా సరదా కాబట్టి ఆగివెళ్దామన్న అక్కయ్యని బలవంతంగా వర్షంలో తడిపేస్తూ, ముద్దగా తడిసిపోయి నవ్వుకొంటూ యింట్లో అడుగు పెట్టిన యిద్దర్నీ, డ్రాయింగ్ రూంలో కార్నర్ టేబిల్ దగ్గర ఫ్లవర్‌వాజ్‌లో పువ్వులు పెడ్తున్న అమ్మ, మా నవ్వుల శబ్దానికి వెనక్కి తిరిగిచూసింది.

నిజంగా అలా చూసినప్పుడు అమ్మ చూపులెంత కర్కశంగా వున్నాయి!

మిగిలిన నుగ్గురిమీద అమ్మ చూపులు నిలిపితే వాటిలో ప్రేమ, ఆపేక్ష తొంగి చూస్తాయి.

కాని — అవే చూపులు నామీదకు వచ్చి నప్పుడందులో నిర్లిప్తత, కర్తవ్యం తొంగి చూస్తాయి.

ఆ చూపుల్ని చూస్తే చాలు. నా మనస్సు కుంచించుకు పోతుంది.

కాని — ఆ రోజు అమ్మ చూపుల్లో నిర్లిప్తత తొంగిచూడ్డం లేదు. దెబ్బతిన్న పదపులివలె కనబడింది నా కళ్ళకి.

గబగబా మా దగ్గరకువచ్చి 'శాలీ! వర్షంలో తడిసావా? నిన్ననేగా రొంప, దగ్గు అంటూ డాక్టర్ దగ్గరకు పరుగులు పెట్టావ్?' అని అంటే అందుకు 'ఫరవా లేదమ్మా! ఏదో పాపకి సరదాకదా వర్షమంటే అందుకని వచ్చామ'ని సర్ది చెప్తున్న అక్కయ్యతో 'పాపకి వర్షమొక్కటే కాదు. మనుష్యుల ప్రాణం తీయడంకూడా సరదా' అనేసి వంటింట్లోకి వెళ్లిపోయింది అమ్మ. అమ్మ నోటి నుండి అంత సూటిగా, అంత కఠినంగా మాటవినని నేను స్థాణువై అలాగే తడి బట్టలతో నిలబడిపోయాను. మొదట నా కసలు ఆమాటే అర్థం కాలేదు. కాని రెండు క్షణాలనంతరం అమ్మ మాటలలోని అర్థం అర్థమయి చుట్టూ చూసే టప్పటికి అక్కయ్య తల తుడవడానికి కాబోలు తువ్వాలు తీసికొని అక్కయ్య గదిలోకి వెళ్తున్న అమ్మని చూసి మెల్లగా మేడమీద నా గదిలోకి వెళ్ళిపోయి, బట్టలు మార్చుకొంటూంటే 'లక్ష్మి! మేడమీదకు వెళ్లి చెప్పు తలతుడుచుకొని, బట్టలు మార్చుకోమని. వర్షంలో తడిసిన మూలంగా మళ్లీ శాలినికి రొంప, దగ్గు మొదలయ్యాయని కూడ చెప్పు' అని క్రిందనుంచి అమ్మ గట్టిగా చెప్తున్న మాటలు చెవిన పడ్తే పేలవంగా నవ్వుకొన్నాను.

అదేం చిత్రమోగాని ప్రొద్దున లేచే టప్పటికి తలంతా బరువుగా, కళ్ళు మంటలుగా వుంటే ఎలాగో ఓపిక చేసికొని క్రిందకు వెళ్లాను. డైనింగ్ రూంలో అమ్మ మెల్లగా ఏడుస్తున్న శబ్దం, నాన్న అందుకు మందలిస్తుండడం వినిపించి కర్టెన్ దగ్గరే ఆగిపోయాను.

అమ్మ ఏడుస్తూ, 'నాకు తెలుసు దాని జాతకమే అంత. అందర్నీ పొట్టన పెట్టుకోవడమే. వర్షంలో సరదా అని శాలినిని తడిపించిన మూలంగా యిప్పుడు చూడండి $103^\circ$ జ్వరం. పుట్టిన క్షణమే నాకు దైవం లాంటి అమ్మను మింగి యిప్పుడు... ఏంటిది భగవాన్?' అని అమ్మ లోలోపల ఏడుస్తూంటే, 'ఛ పారూ! ఏంటిది. పాపదా యిందులో తప్పు. అదే జ్వరం పాప కొస్తే' అని అడుగుతున్న నాన్నకి 'దానికి ఎప్పుడూ రాదు. పుట్టినప్పటి నుండి చూస్తున్నారుగా 'అది చీదడం గాని, దగ్గడం గాని మీరెప్పుడన్నా విన్నారా?' అనే అమ్మ మాటల్ని మరిక వినలేక గదిలోకి వచ్చి మంచం మీద వాలిపోయాను.

ఆ రోజు తెలిసింది అమ్మ నా దగ్గర

మాత్రం నిందుకలా ప్రవర్తిస్తుందో.

వాళ్ళ అమ్మ నేను పుట్టిన క్షణమే చని పోవడానికి నేనే కారణమని అమ్మ భావన.

అబ్బ! ఎంత చేదు నిజం.

చిన్నప్పటి నుండి మొరటుగా దేనివి లక్ష్యం చేయని నేను ఈరోజు ఈ బాధ భరించలేక పోతున్నాను.

ఎవరో చిన్న గుండుసూది తీసికొని సూటిగా హృదయానికి గుచ్చుతున్నట్లుంది.

ఎంత దురదృష్టవంతురాలిని.

నిజానికి ఈ దురదృష్టం నాది కాదు.

ఈ గుండెకోత నాకు కాదు.

అమ్మకి—ముమ్మాటికి అమ్మకే.

నలుగురి పిల్లల్లో ఒకరిని ద్వేషించడం అమ్మ దురదృష్టం.

ఆ ఒకరే తమ యింటి అశుభాలకి మూలమనే భావన అమ్మకి ఎంత గుండె కోతని కలిగిస్తుందో? నామీద నాకే అసహ్యంగా, అమ్మమీద చెప్పలేనంత జాలిగా వుంది.

ఇలా అనుకొంటూ కన్నుమూసిన నేను అలాగే నెలరోజులదాకా టైఫాయిడ్‌లో పడుకొన్నాను.

ఆ నెలరోజులు అమ్మ నాకు కేవలం ఒక నర్సుగా సేవ చేయడం తన కర్తవ్యమనే భావంతో సేవలు చేసింది.

ఆ సమయమే నాదెంత దురదృష్ట జాతకమో నిరూపించింది.

కేవలం అలాంటి ప్రాణాపాయ సమయంలో కూడ అమ్మద్వారా ఒక్కసారన్నా పూర్తిగా ప్రేమతో కూడిన చూపుకు నేను నోచుకోలేదు. అంతే—అదే ఆఖరు. మరె ప్పుడూ కూడ అమ్మ అన్నట్లు నేను


# విధిలిఖితం

పీడదంగాని, దగ్గడంగాని చేసినట్టు నాకే గుర్తులేదు.

అక్కయ్యకి పెళ్ళయి వెళ్ళిపోబోతుంటే ఆ బాధ భరించలేక నేను నా గదిలోకి వెళ్ళిపోయి కిటికీదగ్గర కుర్చీలో కళ్ళు మూసుకొని కూర్చొనివుంటే, అక్కయ్య నా గదిలోకి వచ్చి 'పాపా!' అని పిలిస్తే మెల్లిగా లేచి వెళ్ళి అక్కయ్య కౌగలించుకొని బావురుమన్నాను. అక్కయ్య దగ్గర తప్ప మిగిలిన యిద్దరి దగ్గర నాకు చనువు, అధికారం లేవు. అదీగాకుండ నాకు అక్కయ్యకి ఆరు సం॥ తేడా మూలాన్న అమ్మచేత కొరవయిన ప్రేమను నేను అక్కయ్య ద్వారా తాత్కాలికంగా పొందేదాన్ని. ఆ ప్రేమే కరువయి పోతూంటే కరుడు గట్టిన నా మనస్సు భరించలేక పోతూంది.

'చూడు అదేంటది? మళ్ళీ వచ్చేస్తానుగా. పాపా! నేను ఎన్నో రోజులుగా చెప్పా లనుకొన్నాను గాని అలా దాటేస్తూ వచ్చేశాను. ఇప్పుడు చెప్పాల్సిన అవసరం వచ్చింది. అలా కూర్చో పాపా! చూడు తల్లీ! అమ్మ నీ దగ్గర అలా ప్రవర్తిస్తున్నందుకు కారణం నీకు తెలియదు కదూ! నీకు కూడ తెలిసింనా అక్కా అన్నట్లు చూడకు. నాకు తెలుసు. అమ్మ ప్రవర్తనకు నువ్వు బాధ పడుతున్నావని కూడ తెలుసు. ఆగు, నేను బాధపడటం లేదే అని చెప్పాలని చూడకు. నువ్వు అందరిలాగ బాధపడితే బయటకు ఏడుపుద్వారా వెలువరించవు. ఎప్పుడూ తళతళ మెరిసే నీ కళ్ళు, కాంతి విహీనంగా మారి శూన్యంలోకి వెళ్ళిపోతాయి. అవి చాలు పాపా! నీ మనస్సులోని బాధని నాకు చూపడానికి. చూడు పాపా! నువ్వు పుట్టే రోజది. అమ్మకి కాన్పు చాలా కష్టమని చెప్పాడు డాక్టరు. సరిగ్గా ఈ గదిలోనే అమ్మ ప్రసవించడానికి ఏర్పాటు చేయబడింది. అమ్మపడే బాధ చూడలేక నాన్న క్రిందకు వెళ్ళిపోయారు. చివరకు అతి ప్రయాసతో, డాక్టర్ల చాకచక్యంతో నువ్వు బయటకు వచ్చావు. నా తర్వాత యిద్దరూ మగపిల్లలే. అమ్మకి నాన్నకి ఎందుకో ఆడపిల్లలంటే చాలా యిష్టం. ఇద్దరూ ఆడపిల్లే కావాలని కోరుకున్నారు. అలాగే నువ్వు పుట్టావు. ఈ సంతోష వార్త నాన్నకి అందచేయాలని అమ్మమ్మ ఆనందంతో గబగబా మెట్లు దిగబోయి అరటిపండు తిని తొక్క మెట్లమీదే రాజు పడేస్తే దానిమీద కాలువేసి జారి మెట్లమీద నుంచి క్రింద పడిపోయింది. హార్ట్ ఎటాక్ గల అమ్మమ్మ గుండె తిరిగి పనిచేయలేదు. అదే పాపా! నీ దురదృష్టం. అమ్మమ్మగారు చనిపోకుండా వున్నట్లయితే నువ్వు పెరిగినంత ముద్దుగా మరెవ్వరూ ప్రపంచంలో పెరిగి వుండరు.

పాపా! ఒక్కతే కూతురు అమ్మ అమ్మకి. అమ్మకి తన అమ్మమీద ఎంత ప్రేమంటే తనకి పెళ్ళయితే అమ్మమ్మని విడిచి వెళ్ళాలేమోనని భయంతో యిల్లరికానికి ఒప్పుకొనే అతనినే భర్తగా పొందుతానని చెప్పిందట. అలాగే నాన్నని పొందింది కూడ. నన్ను అమ్మమ్మ ఎక్కువగా ముద్దు



చేస్తే నామీద నీకు ప్రేమ తగ్గింది శాలిని పుట్టిన తర్వాత అనేదట ఈర్ష్యగా అమ్మ. చూశావా పాపా! తన రక్తం పంచుకొని పుట్టిన నన్నే అమ్మమ్మ కొంచెం ప్రేమగాచూస్తే సహించలేని అమ్మ నువ్వు పుట్టిన క్షణమే చనిపోతే సహించ గలదంటావా? అమ్మమ్మ చావుకి మూలకారణం రాజు పడేసిన అరటితొక్క, కాని ఆ మాట అమ్మ ఒప్పుకోదు. నీ జాతకఫలమే అదంటుంది.

పాపా! అమ్మమ్మపోయిన ఐదారు సంవత్సరాలదాకా అమ్మ మనస్ఫూర్తిగా నవ్వడం నేను చూడలేదు. అసలు ఆ దుఃఖం యిప్పటిదాకా తగ్గలేదు. బహుశా తగ్గదేమోకూడ. నిన్ను ఐదారు నెలలదాకా అసలు ముట్టుకునేది కాదు. తర్వాత తర్వాత నాన్న తదితరుల బోధవలన నిన్ను పెంచడం తన కర్తవ్యం, విధి అన్న భావనతో చూసింది. ఇప్పుడు కూడ అలాగే చూస్తుందని నాకు తెలుసునక్కా అన్నట్టు చూడకు. అలాంటి చూపు భరించలేను.

కాబట్టి పాపా! అమ్మ ఏమన్నా మనస్సులో పెట్టుకొని బాధపడకు. ఎందుకంటే నువ్వు బాధపడ్తే ఓదార్చడానికి ఈ అక్కయ్య నీ దగ్గర వుండదు. అందుకే పూర్తిగా చెప్పేను' అని అక్కయ్య అంటే, అలాగే అక్కయ్య గుండెల్లో తలదాచు కొన్నాను.

అంతే—అక్కయ్య వెళ్ళిపోయిన తర్వాత నేను ఒంటరిగా మిగిలి పోయాను.

అక్క పూర్తిగా అమ్మ గురించి చెప్పిన తర్వాత అమ్మ మీద చెప్పలేనంత ప్రేమగా వుండేది. కాని ఒక్కటే ప్రశ్న!

అమ్మ తన కూతుర్నే అమ్మమ్మ ప్రేమగాచూస్తే సహించలేదే. అలాంటి ప్రేమే తన కూతుర్లు కూడ తన దగ్గర నుండి ఆశిస్తారని భావించలేదా అన్న ప్రశ్న నాలో ఎప్పుడూ మెదలుతూ వుండేది.

అక్కవెళ్ళి మూడు సంవత్సరాలు గడిచింది. ప్రస్తుతం నేను బి. ఏ. ఆఖరి సం.లోకి వచ్చాను. ఇక రెండు నెలల్లో నా చదువు పూర్తవుతుంది. ఇక ఆ తర్వాత చదవాలన్న ఆసక్తి నాకు లేదు. కాని ఒక్కటే కోరిక.

కూతురుగా అమ్మ దగ్గర పొందలేని ప్రేమని భార్యగా భర్త దగ్గర పొందాలని వుంది. అది తీరేదాకా?


అప్పుడు నా [illegible] నా [illegible]


# మైక్రోపైరిన్ ఆస్ప్రో

## త్వరగా కరుగుతుంది, త్వరగా ఇముడుతుంది

కనుకనే మామూలు బిళ్ళల కన్నా

**రెట్టింపు త్వరగా పనిచేసి నొప్పిని తొలగిస్తుంది.**






మామూలు బిళ్ళల వలెగాక ఆస్ప్రో అతి సూక్ష్మమైన అణువులు త్వరగా ఇముడుతాయి. నొప్పిని కలిగించే చోటుకు శీఘ్రగతిని చేరి సత్వర నివారణ కలిగిస్తాయి.

మైక్రోపైరిన్ ఆస్ప్రోను: తలనొప్పి • ఒళ్ళు నొప్పి • జలుబు • ఫ్లూ • కీళ్ళ నొప్పులు • గొంతు నొప్పి • పంటి నొప్పులకు వాడండి

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్ళలు. అవసరమైతే మళ్ళీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ళ లేక మీ డాక్టరు సలహా ప్రకారం వేసుకోవాలి.

**నొప్పిని అతి శీఘ్రంగా తొలగించడానికి ఆస్ప్రో మాత్రమే మైక్రోపైరిన్ చేయబడినది**

నికోలస్ (N) తయారు

A.G.37 Tel


అది పేరాశే. మొన్న ఎవరో చూడ్డానికి వచ్చి వెళ్ళిన తర్వాత నేను తోటలో కాలక్షేపానికి తిరుగుతూ వున్నాను. నాన్న ఆఫీసు గది కిటికీ బయటకు తోటలోకి వుంటుంది. దాని దగ్గరకు వచ్చి వెనక్కి పోబోతున్న నాకు, 'దీని జాతకం, ఆ అబ్బాయికి కూడ ఏమన్నా కీడు చేయదుకదా. నాకదే భయంగా వుంది' నిస్తేజంగా అంటున్న అమ్మ మాటలు చెవిన పడ్డాయి.

ఆ రోజు వర్షంలో—తడిసిన రోజు—మనుష్యుల ప్రాణం తీయడం కూడ సరదా అన్న అమ్మ మాటలకు స్తబ్ధురాలయిన

## విధిలిఖితం

నేను - మళ్ళీ — అమ్మ నా పెళ్ళి గురించి చెప్తుంటే విని ఆ స్థలం నుండి కదిలే శక్తిని కోల్పోయాను.

అందుకు నాన్న 'పారూ! పాప నీ కూతురు. దాని గురించి నువ్విలా మాట్లాడడం భావ్యం కాదు, నేను సహించలేను కూడ.' అని అంటే 'నా కూతురు, నా కూతురు' అని గొణుక్కుంటూ అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోతున్న అమ్మను ప్రత్యక్షంగా నాన్న, పరోక్షంగా నేను జాలిగా చూశాం.




కాని— ఈనాడు — చంద్ర ప్రవర్తన గురించి చెప్పితే నా మనసే అతనికి ధైర్యం ఇచ్చిందట. ఎంతటి అసత్యం పలికింది!

నిజమే. అమ్మదగ్గర పొందలేని ప్రేమ యితరుల దగ్గర దొరుకుతుందేమో నన్న భ్రమతో నేను అందరిదగ్గరా గలగలా మాట్లాడేస్తాను. నా మనసే చంద్ర ప్రవర్తనకి కారణమని అమ్మ చెప్పింది. నిజమే.

కాని—అమ్మవలననే ఆ పరిస్థితి ఏర్పడిందని అమ్మకెలా చెప్పడం?

ఆనాడు పెళ్ళిచూపులకు వచ్చినవాళ్ళకి నేను నచ్చానట, ముఖ్యంగా అతనికి. ఈమాట పెళ్ళిళ్ళ పేరయ్య అమ్మా నాన్నలతో అంటూంటే చాటుగా విన్న నా హృదయం ఆనందంతో పొంగలేదు. మొట్ట మొదటిసారిగా భయంతో, ఆందోళనతో అల్లకల్లోలమైంది.

ఆడపిల్ల కావాలని అమ్మా, నాన్న కోరుకుంటే వాళ్ళ కోరిక ప్రకారమే పుట్టాను.

కాని— వాళ కోరిక అడుగంటింది.

ఆస్థానంతో నామీద ద్వేషం పుట్టింది. నేను ప్రవేశించకముందు నేనే కావాలని కోరుకొన్న అతనికి నా ప్రవేశానంతరం అమ్మ అన్నట్లు ఏదన్నా జరిగితే ?

లేకపోతే ఏ కారణం చేతన్నా నామీద ద్వేషం కలిగితే...?

ఆడపిల్ల పుట్టాలని అమ్మా నాన్నలు ఎంతలా కోరుకున్నారో అదేవిధంగా నన్ను పొందాలని అతను కోరుకొన్నాడు. కాని— కాని— భగవాన్! అమ్మ కోరికకు కలిగిన ఫలితాన్ని మాత్రం అతని కోరికకు కలిగించకు.

ఎందుకంటే 18 సంవత్సరాలుగా ముమ్ముందు జీవితం గురించి కలలు కంటున్న నాకు అవి కల్లలని తెలిస్తే బ్రతకలేను గనుక.

ముఖ్యంగా అతి మధురమని చెప్పే ప్రేమను పొందే అవకాశం జీవితంలో ఇంకెక్కడా నాకు కలుగదేమో గనుక.

'పాపా!' క్రిందనుంచి వినబడ్డ కేకతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఆరోజు చెప్పేస్తానంటున్న సంగతి.